## రఘునందన్‌కు అభినందనలు



సిటీబ్యూరో, జనవరి 4 ( నమస్తే తెలంగాణ ) : పొగాకు నియంత్రణకు నిర్విరామ కృషి చేస్తున్న మాచన రఘునందన్‌ను టాటాస్మృతి కేంద్రం వెల్‌డన్ రఘునందన్ అంటూ అభినందించింది. దేశ వ్యాప్తంగా రఘునందన్ క్యాన్సర్‌పై పరిశోధన, పొగాకు నియంత్రణకు కృషి చేస్తున్న వారిని టాటా మెమోరియల్ సెంటర్, టాటా ట్రస్ట్‌లు అభినందిస్తున్నాయి. అందులో భాగంగా రఘునందన్ తన పరిశోధనకు సంబంధించిన అంశాలను టాటా ట్రస్ట్‌కు వివరించారు. క్యాన్సర్, క్ష యలతో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని పేర్కొన్నాడు. దీంతో ట్రస్ట్ రగునందన్‌ను అభినందించింది.

# గురుబ్రహ్మనగర్‌లో హైడ్రా కలకలం

- పార్కు స్థలం అంటూ ప్రహరీ నిర్మాణం
- హైడ్రా కమిషనర్‌కు బస్తీవాసుల ఫిర్యాదు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు

బంజారాహిల్స్,జనవరి 4: జూబ్లీహిల్స్ డివిజన్ గురుబ్రహ్మనగర్‌లో మరోసారి హైడ్రా అధికారుల కలకలం చెలరేగింది. నందగిరి హిల్స్ కాలనీకి చెందిన పార్కు స్థలం అంటూ సుమారు 1500 గజాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తుండటంతో బస్తీవాసులు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌ను ఆనుకుని ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీవాసులకు, నందగరి హిల్స్ సొసైటీకి మధ్యన ఉన్న ఖాళీ స్థలం విషయంలో చాలాకాలంగా వివాదం నడుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్థానికంగా పర్యటించి నందగిరిహిల్స్ సొసైటీ వాసులకు మద్దతుగా పార్కు స్థలం అంటూ పేదల గుడిసెలకు అడ్డుగా ఫెన్సింగ్ నిర్మించేందుకు కూల్చివేతలు చేపట్టిన సంగతి తెలిసిందే. బస్తీవాసులు ఆందోళనకు దిగడంతో పాటు తమకు దారిలేకుండా ఎలా చేస్తారంటూ ఫెన్సింగ్‌ను కూల్చేయడంతో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్, హైడ్రా కమిషనర్ మీద తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు. చెరువుల సంరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా పేదల బస్తీల జోలికి ఎలా వస్తుందంటూ పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో అప్పట్లో వెనక్కి తగ్గారు. శుక్రవారం సాయంత్రం నుంచి గురుబ్రహ్మనగర్‌ను ఆనుకుని ఉన్న సుమారు 1500 గజాల స్థలంలో ప్రహరీ నిర్మాణం కోసం నందగిరి హిల్స్ సొసైటీ పనులు ప్రారంభించడంతో మరోసారి ఈ వ్యవహారంలో వివాదం రాజుకుంది. జీహెచ్‌ఎంసీతో సంబంధం లేకుండా ప్రైవేటు వ్యక్తులు ప్రహరీ నిర్మాణం చేస్తున్నారని, స్థానికంగా నివాసం ఉంటున్న బసవరాజు అనే వ్యక్తి ప్రోద్భలంతో హైడ్రా అధికారులు తమను బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ బస్తీవాసులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం ఫిలింనగర్ 18బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగరావు నాయకత్వంలో బస్తీ అధ్యక్షుడు గోపాల్ నాయక్, రాంచందర్, రవినాయక్ తదితరులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిశారు. ఇండ్లు కట్టకముందే తమ గుడిసెల చుట్టూ ప్రహరీలు నిర్మిస్తే ఊరుకునేదిలేదని బస్తీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ తెలిపారు. సుమారు 300 ఎస్టీ,ఎస్సీ కుటుంబాలు ఇక్కడ 30ఏళ్లుగా నివాసం ఉంటున్నాయని, వారికి ఇబ్బందులు కలిగిస్తే మరోసారి పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి ఉంటుందని మామిడి నర్సింగరావు హెచ్చరించారు.



గురుబ్రహ్మనగర్ బస్తీని ఆనుకుని ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

## క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయాన్ని ఖండిస్తున్నాం

### మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి 4 : రైతు భరోసా విషయంలో క్యాబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా ప్రతి రంగాన్ని నష్టాల్లోకి నెట్టేస్తూ పైశాచికానందం పొందుతుందని ఆరోపించారు. రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం.. ఇప్పటికీ పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వకపోగా.. దరఖాస్తు చేస్తేనే భరోసా అనే మాటను చెప్తున్నారని మండిపడ్డారు. దరఖాస్తు చేస్తేనే రైతు భరోసా అంటే ప్రభుత్వాన్ని చేయి చాచి అడుక్కోవాలని పరోక్షంగా చెప్తున్నట్లుందని పేర్కొన్నారు. రైతులను బిక్షగాళ్లను చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమా? అని ప్రశ్నించారు. రైతుకు ధైర్యాన్ని ఇవ్వడం మరిచి రైతులను ఆడుకునే స్థాయికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజార్చిందని పేర్కొన్నారు. రైవంత్‌రెడ్డి సర్కారుకు బీటలు వారే కాలం వచ్చిందని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సైతం నచ్చకపోయినా రేవంత్‌రెడ్డి నిర్ణయాలకు తలొగ్గక తప్పడం లేదని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మళ్లీ దరఖాస్తు అడగడమంటే పథకాన్ని ఆలస్యం చేయడమేనని అనుమానం వ్యక్తం చేశారు. త్వరలోనే రైతుకు అనుకూలమైన నిర్ణయం తీసుకుని వెంటనే రైతు భరోసా హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ



లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

మలక్‌పేట, జనవరి 4: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికలాంగుల సంక్షేమ భవన్ ఆవరణలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ 216 వ జయంతి వేడుకలకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఆయన మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజ, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభా రాణిలతో కలిసి దివ్యాంగుల జాతీయ ఉద్యానవనంలోని లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. దివ్యాంగుల ఉపకరణాల కోసం రూ.50 కోట్ల నిధులు ఇచ్చిందని, అంతకు వికలాంగుల సదనాల నిర్మాణానికి మరో రూ.4 కోట్లు ఇవ్వటం జరిగిందని తెలిపారు. వికలాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజ, మేనేజర్ ప్రభంజన్‌రావు, ఏడీ రాజేందర్, వికలాంగుల సంఘాల నాయకులు గంగారాం, శ్రీశైలం, రేడియో జాకీ వెంకటేశ్, దివ్యాంగ అడ్వకేట్ సుప్రియ అంధులు, దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేపు న్యూ టర్మినల్ ప్రారంభోత్సవం



ఈ నెల 6న నిర్వహించే చర్లపల్లి న్యూ టర్మినల్ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని శనివారం రైల్వే అధికారి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. – కాప్రా,జనవరి 4

## పద్మశాలీ సంఘం నాయకులకు సన్మానం



బీఆర్‌ఎస్ మాజీ ఎంపీటీసీ జూకంటి అనూరాధ అనిల్ ఆధ్వర్యంలో పద్మశాలి మండల, గ్రామ కమిటీలను సన్మానించారు

ఆలేరు టౌన్, జనవరి 4 : పట్టణంలోని రహదారి బంగ్లాలో ఇటీవల నూతనంగా ఎన్నికైన పద్మశాలీ సంఘం సభ్యులను మాజీ ఎంపీటీసీ కంటి అనూరాధ అనిల్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. సన్మానించిన వారిలో పద్మశాలీ సంఘం ఆలేరు మండలాధ్యక్షుడు సామల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అమృతం నరసిహులు, చింతకింది బలరాం, గుండు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి అంకం రాజు, కోశాధికారి అంకం మల్లేశం, కార్యదర్శులు ఎలగందుల రామబుషి, కుర్రి మార్కండేయ, ప్రచార కార్యదర్శి ఎలగందుల సిద్దులు, కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జూకంటి అనిల్, ఉప సర్పంచ్ నీల రామన్న, కేశవులు, శ్రవణ్, శేఖర్, రమేశ్, శ్రీను, రాములు, నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రమాణ పత్రాల పేరుతో రైతు భరోసాను ఎగగొట్టే ప్రయత్నం

### మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట, జనవరి14: రైతుల నుంచి ప్రమాణ పత్రాలను స్వీకరించే పేరుతో రైతు భరోసాను ఎగగొట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. ప్రజా పాలనలో భాగంగా లక్షా 6 వేల దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించిందని తెలిపారు. ప్రతి రైతుకూ రైతు భరోసా ఇస్తామని ఎన్నికల్లో హామీనిచ్చి ఇప్పుడు మోసం చేయాలని చూస్తున్నదని పేర్కొన్నారు. ప్రమాణ పత్రాలను ఇవ్వాలని రైతులకు కోరడం దురదృష్టకరమని మండిపడ్డారు. రైతులకు ప్రభుత్వమే ప్రమాణ పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఎన్ని ఎకరాలకు రుణమాఫీ ఇచ్చారో, ఎంత మంది రైతులకు మాఫీ జరిగిందో కరపత్రాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాజమానులు, కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో పొందుపర్చాలని పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.6 వేలు ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

## టీఎస్‌యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

ఆత్మకూరు(ఎం), జనవరి 4 : మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కొణతం శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, రవి, సోమయ్య, శ్రీను, నాయకులు దామోదర్, రమేశ్, వెంకన్న, సంధ్యారాణి పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ మాలతి, వాసాలమర్రి ప్రధానోపాధ్యాయురాలు బాలమణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు ముత్యాల మల్లేశం, మండలాధ్యక్షుడు పెద్ది భిక్షమయ్య, నాయకులు శ్రీనివాసాచారి, శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న, హరిత, తారకమ్మ, అశోక్ పాల్గొన్నారు.

## మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదుగాలి : ఏపీఎం

ఆత్మకూరు(ఎం), జనవరి 4: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను పొంది ఆర్థికంగా ఎదుగాలని ఏపీఎం కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని నచ్చిన వ్యాపారం చేస్తూ ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు సామాజిక జీవన విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీసీ వెంకన్న, వీబీకే స్వప్న, విజయ, మానస, అనిత, లక్ష్మి, ఆండాలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అవినీతి

### అడిషనల్ కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



అడిషనల్ కమిషనర్ శైలజతో సమావేశమైన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

చార్మినార్, జనవరి 4 : ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిష్పక్షపాతంగా కొనసాగించేందుకు కృషి చేయాలని కోరుతూ బహదూర్‌పు, చాంద్రాయణగుట్ట , చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు పులిపాటి రాజేశ్ కుమార్, బోయ నగేశ్, ముజీబుల్లాహ్ శనివారం చార్మినార్ జోనల్ అడిషనల్ కమిషనర్ శైలజను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సర్వే సిబ్బంది వ్యవహారం వల్ల అభాసు పాలవుతుందని అన్నారు. నిజమైన నిరుపేదలను గుర్తిస్తూ వారికి ఇళ్లు అందించేందుకు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సిబ్బంది నిరుపేదల వద్ద ప్రతి కుటుంబం నుంచి రూ.300 నుంచి రూ. 3000 వేలు వసూళ్లు చేస్తున్నట్లు ఆధారాలు సైతం అందించామని తెలిపారు. సర్వే సిబ్బంది వ్యవహారంతో ప్రభుత్వానికి మచ్చతెచ్చే విధంగా ఉందని వాపోయారు. అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై తక్షణం చర్యలు తీసుకుని, ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ట్రాఫిక్ పార్కుల ఏర్పాటుకు స్థలాలు గుర్తించాలి

సిటీబ్యూరో, జనవరి 4 ( నమస్తే తెలంగాణ ) : పాఠశాలల్లో ట్రాఫిక్ పార్కుల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం రవాణా, విద్యాశాఖ, జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులతో ఆయన రోడ్డు భద్రతా మాసోత్సవంపై సమీక్షించారు. రోడ్డు భద్రతపై అందరికి అవగాహన కల్పించేలా భారీ ర్యాలీ చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో సైన్‌బోర్డులు ఇతర ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్, జిల్లా విద్యా శాఖాధికారి రోహిణి తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్ 4 ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

సిటీబ్యూరో, జనవరి 4 ( నమస్తే తెలంగాణ ) : నూతనంగా ఉద్యోగం పొందిన గ్రూప్ 4 ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో గ్రూప్ 4 ఉద్యోగులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. వినయం, ఓపికతోని ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు టెక్నాలజీపై అవగాహన కల్పించుకుని నైపుణ్యం పెంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఏఓ సదానందం పాల్గొన్నారు.

## హ్యాండ్లూమ్ ఆర్‌డీడీ పద్మకు సన్మానం




రాష్ట్ర హ్యాండ్లూమ్ ఆర్‌డీడీ పద్మను సత్కరిస్తున్న చేనేత నాయకులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 4 : తెలంగాణ హ్యాండ్లూమ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మను హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత జన సమాఖ్య అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం శనివారం సన్మానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత పొదుపు పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. చేనేత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పద్మ తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణకు బీసీల సంపూర్ణ మద్దతు

ఖైరతాబాద్, జనవరి 4 : వర్గీకరణ ఉద్యమం రాజ్యాంగబద్ధమైంది..దానికి బీసీ సమాజం సంపూర్ణ మద్దతునిస్తుందని వక్తలు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా బీసీ, ప్రజాస్వామిక మేధావుల సంఘీభావ రౌండ్ టేబుల్ సమావేశం తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సుదీర్ఘ పోరాటమని, ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా నేడు అది సాకారమయ్యే సమయం వచ్చిందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా వర్గీకరణ అనేది ఆగదన్నారు. దేశంలోనే అత్యధిక శాతం ఉన్న బీసీలు నేడు వర్గీకరణను మద్దతుగా నిలువడం హర్షణీయమన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ రాజ్యాంగం అందరికీ సమానమైన హక్కులు ఇచ్చిందని, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన వారికి హక్కులను అందించాలని స్పష్టం చేసిందన్నారు. జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ తిరుమల రావు, ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, అరుణోదయ విమలక్క, తెలంగాణ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్

ఖైరతాబాద్, జనవరి 4 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు గిరిజనులకు అనేక పథకాలను ప్రవేశపెడుతామని, వారి సంక్షేమానికి పాటుపడుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 33 గిరిజన తెగలు, 33లక్షల గిరిజనులు ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వారి ఓట్లే కీలకమయ్యాయని తెలిపారు. ట్రైకార్‌లో రూ.219 కోట్లు నిధులు సిద్ధంగా ఉన్నా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉందని, వాటిని విడుదల చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. గిరిజనుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ అశోక్ నాయక్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మనాయక్, శ్రీరాం నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజయ్య నాయక్, స్వరూప బాయి, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోకిని రాజు, కూతాడి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓల్డ్ సిటీ మెట్రో పిల్లర్ల ఎత్తు పెంచాలి



సిటీబ్యూరో, జనవరి 4(నమస్తే తెలంగాణ) : ఓల్డ్ సిటీ మెట్రో పిల్లర్ల ఎత్తు విషయంలో మెట్రో సంస్థ జాగ్రత్తలు తీసుకోవాలని పలు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి హెచ్‌ఎంఆర్‌ఎల్‌ను కోరింది. శనివారం హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ ఉత్సవాల సందర్భంగా భారీ గణనాథుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పిల్లర్ల ఎత్తు ఉండాలని సూచించారు. ప్రముఖ గణేశ్ ఉత్సవ సమితి అయినా బాలాపూర్ గణపతి విగ్రహం వెళ్లే మార్గంలో అందుకు తగినట్లుగా ఎత్తు ఉండాలని కోరారు.

### మెట్రో స్టేషన్ పేరు మార్చాలి: వీహెచ్‌పీ

ఎల్బీనగర్–మియాపూర్ మార్గంలో ఉండే విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ పేరును మార్పు చేయాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. శనివారం వీహెచ్‌పీ ప్రతినిధుల బృందం మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని కలిసి సూచనలు చేశారు. ఈ మేరకు మెట్రో స్టేషన్ మెట్లు అష్టలక్ష్మి టెంపుల్ ప్రధాన మార్గం వద్దనే ఉన్నాయని, ఆ స్టేషన్‌కు కచ్చితంగా అష్టలక్ష్మి మెట్రో స్టేషన్‌గా నామకరణం చేయాలని వినతి పత్రంలో కోరారు. బ్రిటిష్ వలస పాలకుల క్రూరత్వానికి చిహ్నమైన విక్టోరియా మెమోరియల్ పేరును మెట్రో స్టేషన్‌కు పెట్టడంపై వీహెచ్‌పీ ప్రతినిధి డా. రావినూతల శశిధర్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు.


## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 10 కే రన్



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిర్వహించిన 5కే,10కే రన్‌లో పాల్గొన్న రన్నర్స్

శంషాబాద్ రూరల్, జనవరి 4: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శనివారం సాయంత్రం 5కే, 10 కే రన్ నిర్వహించారు. ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణికర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎంఆర్ హైదరాబాద్(శంషాబాద్) ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో నాల్గో ఎడిషన్‌లో 4300 మంది ఉత్సాహ భరితంగా పాల్గొన్నట్లు తెలిపారు. ఔత్సాహికలలో ఆరోగ్యం, ఫిట్‌నెస్ స్నేహసంబంధాన్ని పెంపొందించడానికి ప్రతి ఏడాది ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రన్‌లో 18 ఏండ్ల నుంచి 60 ఏండ్ల వయస్సు ఉన్నవారు పాల్గొని విజయవంతం చేశారని వివరించారు. రన్‌తో వినోదంతో పాటు ఆరోగ్యకరమైన ప్లాట్‌ఫాంను అందించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

## దేశమంతా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



అభివాదం చేస్తున్న సుదర్శన్, బాలయ్య, శ్రీనివాస్

ఖైరతాబాద్, జనవరి 4 : బీజేపీ ప్రభుత్వం కేంద్రంలోనూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు అనుకూలమని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేయాలని, అందు కోసం జస్టిస్ ఉషా మెహ్రా ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 1097 ఎస్సీ ఉపకులాలు ఉన్నాయని, వారందరికీ న్యాయం జరగాలంటే వర్గీకరణే మార్గమన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ జేఏసీ తెలంగాణ ఇన్‌చార్జి పులిగిల్ల బాలయ్య, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు జయ, రాష్ట్ర కో కన్వీనర్ బొట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.